ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
శుక్రవారం 21
నవంబర్
2025





# సోషల్ వెల్ఫేర్ మినిస్ట్రీయల్ స్టాఫ్ సమస్యలు పరిష్కరిస్తా

**మంత్రి అడ్లూరి స్పష్టీకరణ**

**అతి త్వరలో తెలంగాణ సోషల్ వెల్ఫేర్ స్టాఫ్ అసోసియేషన్ తో మంత్రి ప్రత్యేక సమావేశం.**





హైదరాబాద్, నవంబర్ 20:(రోమింగ్ న్యూస్):
షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ మంత్రి లక్ష్మణ్ తో టీజీ కులాల అభివృద్ధి శాఖ మినిస్టీరియల్ స్టాఫ్ అసోసియేషన్ కార్యవర్గం జరిపిన సమావేశం ఆహ్లాదకరమైన వాతావరణంలో జరిగింది. స్టాఫ్ అసోసియేషన్ ప్రస్తావించిన పలు డిమాండ్లకు మంత్రి అడ్లూరి సానుకూలంగా స్పందించారు. తెలంగాణ ఎస్సిడిడి మినిస్టీరియల్ స్టాఫ్ అసోసియేషన్ రిప్రజెంటేషన్ పై చర్చించేందుకు సెక్రటరీ తో సమావేశాన్ని ఏర్పాటు చేయాల్సిందిగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ అధికారులను ఆదేశించారు. అదేవిధంగా తెలంగాణ షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ మినిస్టీరియల్ స్టాఫ్ అసోసియేషన్ కార్యవర్గంతో సెక్రటేరియట్ లోని తన చాంబర్ లో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి దీర్ఘకాలికంగా పెండింగ్ లో ఉన్న సమస్యలన్నింటిని తక్షణమే పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. డిఎస్ సి డి ఓ మరియు సూపరింటెండెంట్ కేడర్ స్ట్రెంతును తక్షణమే మంజూరు చేయాలని, సూపరింటెండెంట్ లను అడ్మినిస్ట్రేషన్ అధికారిగా గెజిటెడ్ హోదా కల్పించాలని, ఐ ఎఫ్ ఎం ఐ ఎస్ లో జాక్ట్ ను తొలగిస్తేనే జాక్ట్ లను జూనియర్ అసిస్టెంట్ లుగా మార్చడానికి వీలవుతుందని ఎస్సీ డిడి మినిస్టీరియల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఉప్పు సత్యనారాయణ మంత్రికి వివరించారు. అదేవిధంగా ఇటీవల ప్రభుత్వం 317 జీవో ప్రభుత్వ ఉద్యోగ బాధితులకు తక్షణమే న్యాయం చేయాలని కార్యవర్గం విజ్ఞప్తి చేసింది. అదేవిధంగా అర్హత ఉన్న జాక్ట్ లను అందరిని జూనియర్ అసిస్టెంట్ లుగా మార్చే విధంగా తక్షణమే చర్యలు తీసుకోవాలని కార్యవర్గం కోరింది. కొన్ని జిల్లాలలో కేడర్ స్ట్రెంత్ చాలా తక్కువగా ఉండి పని భారం పెరిగి ఉద్యోగస్తులు మానసిక వేదనకు గురవుతున్నారని మంత్రి దృష్టికి తెచ్చారు. ఎస్సీ కార్పొరేషన్ లో అన్ని రకాల కేడర్ ల లో 50% కోటా కింద ఎస్సిడిడి సిబ్బందికి అవకాశం కల్పించాలని, సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఇనిస్ట్యూట్ లో 25% కోటాకు అవకాశం కల్పించాలని, ఇతర క్లిష్ట సమస్యలన్నింటిని తక్షణమే పరిష్కరించాలని తెలంగాణ ఎస్సిడిడి మినిస్టీరియల్ స్టాఫ్ అసోసియేషన్ కార్యదర్శి యు.ఎ.అరవింద్ కుమార్, ఉమెన్స్ వింగ్ స్టేట్ ప్రెసిడెంట్ శ్రీమతి కె.లత, మహిళా నాయకురాలు కొప్పోలు అనురూప, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవి గణపురం మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కు విజ్ఞప్తి చేశారు.

# ‘కార్తీకం’లో నర్సన్నకు ‘కాసుల’ వర్షం

**‘కార్తీకం’లో నర్సన్నకు ‘కాసుల’ వర్షం**

**కార్తీకమాసంలో యాదగిరిగుట్ట దేవస్థానానికి రూ.17.62 కోట్ల ఆదాయం**

**రికార్డుస్థాయిలో 24,447 సత్యనారాయణస్వామి వ్రతాలు**

**గతంతో పోల్చితే భారీగా పెరిగిన ఆదాయం, వ్రతాలు**



యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి కార్తీకమాసంలో కాసుల వర్షం కురిసింది. అక్టోబర్ 22న మొదలైన కార్తీకమాసం నవంబర్ 20తో ముగిసింది. ఈ నెల రోజుల్లో భక్తులు జరిపించిన కార్తీక పూజలు, పలు రకాల పూజలు, నిత్య కైంకర్యాల ద్వారా ఆలయానికి రికార్డుస్థాయిలో రూ.17,62,33,331 ఆదాయం సమకూరిందని ఆలయ ఈవో వెంకటరావు గురువారం వెల్లడించారు. 2024 కార్తీకమాసంలో ఆలయానికి రూ.14,30,69,481 ఆదాయం రాగా.. ఈసారి దానిని అధిగమిస్తూ రూ.17,62,33,331 ఆదాయం సమకూరింది. అంటే గతేడాది కార్తీకమాసంతో పోల్చితే.. ఈసారి రూ.3,31,63,850 ఇన్ కమ్ అధికంగా వచ్చింది.



## కార్తీకంలో రికార్డుస్థాయి వ్రతాలు

కార్తీకమాసంలో హరిహర క్షేత్రమైన యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో రికార్డుస్థాయిలో సత్యనారాయణస్వామి వ్రతాలు జరిగాయి. అన్నవరం తర్వాత ఆ స్థాయిలో యాదగిరిగుట్ట నారసింహుడి ఆలయంలో సత్యదేవుడికి భక్తులు వ్రతాలు జరిపించుకోవడం ఆనవాయితీ వస్తోంది. అదే ఆనవాయితీని మరోసారి నిజం చేస్తూ ఈ యేడు కార్తీకమాసంలో భక్తులు యాదగిరిగుట్టలో అత్యధిక సంఖ్యలో సత్యనారాయణస్వామి వ్రతాలు జరిపించుకుని మొక్కులు తీర్చుకున్నారు. గతేడాది కార్తీకమాసంలో యాదగిరిగుట్టలో 23,263 మంది దంపతులు వ్రతాలు జరిపించుకోగా.. ఈ సారి దానిని క్రాస్ చేస్తూ రికార్డుస్థాయిలో 24,447 మంది జంటలు సత్యదేవుడికి వ్రతాలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. గతేడాది కార్తీకమాసంలో జరిపించుకున్న వ్రతాలతో పోలిస్తే.. ఈ సారి 1,184 వ్రతాలు అధికంగా జరిగాయి. ఈ సారి కేవలం సత్యనారాయణస్వామి వ్రతాల నిర్వహణ ద్వారానే ఆలయానికి రూ.2,44,47,000 ఆదాయం సమకూరింది.

# వైభవంగా ‘కార్తీక వనభోజనాలు’

**పాల్గొన్న ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య**





యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: కార్తీకమాసం ముగింపు సందర్భంగా యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో గురువారం ‘కార్తీక వనభోజనాలు’ నిర్వహించారు. గురువారంతో కార్తీకమాసం ముగియడంతో.. ఆలయ సంప్రదాయం ప్రకారం మల్లాపురం శివారులోని దేవస్థాన తోటలో కార్తీక వనభోజనాలు నిర్వహించారు. మొదట తోటలో తులసీ దామోదర కల్యాణం, సత్యనారాయణస్వామి వ్రతం శాస్త్రోక్తంగా చేపట్టారు. అనంతరం కార్తీక వనభోజనాలు నిర్వహించారు. అనంతరం దేవస్థాన తోటలో సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. ఈ వనభోజనాల కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పాల్గొన్నారు. మొదట గోమాతకు ప్రత్యేక పూజలు చేసి అరటిపండ్లు ఆహారంగా ఇచ్చారు. అనంతరం తులసీ చెట్టుకు పూజలు నిర్వహించారు. తులసీ దామోదర, సత్యనారాయణస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఈవో వెంకటరావు, పోలీస్ సిబ్బంది, ఆలయ అధికారులు, పాత్రికేయులతో కలిసి వనభోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో యాదగిరిగుట్ట డివిజన్ ఏసీపీ శ్రీనివాస్ నాయుడు, టౌన్ సీఐ భాస్కర్, ఎస్పీఎఫ్ కమాండెంట్ శ్రీనాథ్, సీఎస్ఓ శేషగిరిరావు తదితరులు ఉన్నారు.

# పాతగుట్ట రోడ్డు బాధితులకు న్యాయం చేయాలి

**బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కర్రె వెంకటయ్య, పట్టణ అధ్యక్షుడు పాపట్ల నరహరి**

**యాదగిరిగుట్టలో బాధితులకు మద్దతుగా బీఆర్ఎస్ నాయకుల రాస్తారోకో**



యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: యాదగిరిగుట్ట పట్టణంలోని పాతగుట్ట రోడ్డు విస్తరణలో ఇండ్లు, ప్లాట్లు కోల్పోతున్న బాధితులకు తగిన నష్టపరిహారం చెల్లించి న్యాయం చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కర్రె వెంకటయ్య, పట్టణ అధ్యక్షుడు పాపట్ల నరహరి డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం బాధితులకు మద్దతుగా పాతగుట్ట చౌరస్తాలో బీఆర్ఎస్ శ్రేణులు, బాధితులతో కలిసి రాస్తారోకో నిర్వహించారు. రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం యాదగిరిగుట్ట ఆలయాన్ని పునర్నిర్మాణం చేసిన సమయంలో.. రోడ్డు విస్తరణలో ఇండ్లు, ప్లాట్లు, దుకాణాలు కోల్పోయిన నిర్వాసితులకు.. తగిన నష్టపరిహారాన్ని చెల్లించిన తర్వాతే పునర్నిర్మాణ పనులను చేపట్టిందన్నారు. అదే తరహాలో ప్రస్తుతం పాతగుట్ట రోడ్డు విస్తరణ బాధితులకు తగిన నష్టపరిహారం చెల్లించి పనులు ఆరంభించాలన్నారు. నష్టపరిహారంతో పాటు ఇండ్లు కోల్పోయిన వారికి ఇండ్లు, ప్లాట్లు కోల్పోయిన వారికి ప్లాట్లు, దుకాణాలు కోల్పోయిన బాధితులకు వైటీడీఏ పరిధిలో దుకాణాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. పాతగుట్ట రోడ్డు బాధితుల న్యాయమైన డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని, లేకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రాస్తారోకో కారణంగా రోడ్డుపై భారీగా ట్రాఫిక్ జామ్ కావడంతో.. పోలీసులు వచ్చి సముదాయించడంతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో ఆలేరు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గడ్డమీది రవీందర్ గౌడ్, మండల నాయకులు నాయకులు ఆరె శ్రీధర్ గౌడ్, పేరబోయిన సత్యనారాయణ, గడ్డం చంద్రం, సతీష్ బట్, కొన్యాల నరసింహారెడ్డి, గంజి సూర్యనారాయణ, దండబోయిన వీరేష్ యాదవ్ తదితరులు ఉన్నారు.

# రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

**పెద్దకందుకూరు రైల్వే గేటు వద్ద నేషనల్ హైవేపై ఘటన**

యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: రోడ్డు దాటుతుండగా కారు ఢీకొనడంతో ఓ మహిళ చనిపోయిన ఘటన గురువారం యాదగిరిగుట్ట మండలం పెద్దకందుకూరు రైల్వే గేటు సమీపంలోని హైదరాబాద్-వరంగల్ నేషనల్ హైవేపై జరిగింది. యాదగిరిగుట్ట టౌన్ సీఐ భాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం.. మోటకొండూర్ మండల కేంద్రానికి చెందిన వంగపల్లి ఉప్పలమ్మ(50) అనే మహిళ కూలీ పని చేస్తూ జీవనం సాగిస్తుంది. ఈ క్రమంలో పెద్దకందుకూరు రైల్వే గేటు వద్ద జాతీయ రహదారిని దాటుతుండగా.. ఆలేరు నుండి హైదరాబాద్ వైపు వేగంగా వెళ్తున్న కారు ఢీకొట్టింది. దీంతో సదరు మహిళ తల, కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలు కావడంతో.. హుటాహుటిన హైదరాబాద్ లోని నిమ్స్ హాస్పిటల్ కు తరలించారు. మధ్యాహ్నం 3 గంటల సమయంలో చికిత్స పొందుతూ మహిళ చనిపోయినట్లు పోలీసులు తెలిపారు. మృతురాలి మరిది చాట్ల రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ భాస్కర్ వెల్లడించారు.

